సాక్షి కామారెడ్డి

గురువారం । 14 । నవంబర్ । 2024



అభివృద్ధి బాటలో నడిపిస్తా

నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపి స్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పేర్కొన్నారు.

- 9లో ▸



సమగ్రంగా చేపట్టాలి

కుటుంబ సర్వేను పకడ్బందీగా, సమగ్రంగా నిర్వహించాలని బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.3 /15.9

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

16న దివ్యాంగులకు ఆటల పోటీలు

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 16న ఉదయం 10 గంటలకు దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి చందర్‌నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పరుగు పందెం, షాట్‌పుట్, చదరంగం, క్యారమ్స్, జావెలిన్ త్రో, వీల్‌చైర్, ట్రై సైకిల్ అంశాలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా పోటీలలో విజేతలను ఈనెల 21, 22 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

పుణ్య స్నానాలకు వచ్చి..

- తల్లి కళ్ల ముందే నీట మునిగి కొడుకు మృతి

మోర్తాడ్: తన కళ్ల ముందే కొడుకు నీట మునిగి పోతుంటే ఆ తల్లి తల్లడిల్లింది. కుమారుడిని రక్షించమని కేకలు వేసింది. ఆమె మాటలు విని స్థానికులు రక్షించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఏర్గట్ల మండలం తడపాకల్ గోదావరి నదిలో నీట మునిగి బుధవారం ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు.. మాక్లూర్ మండలం మానిక్‌బంఢార్‌కు చెందిన ఉమ్మాయి గంగమణి ఇంటర్ చదువుతున్న తన కొడుకు రామ్‌చరణ్(16)ను వెంటబెట్టుకుని తడపాకల్‌కు చేరుకుంది. నది స్నానాలను ఆచరించడానికి రామ్‌చరణ్ నదిలోకి దిగాడు. వెంటనే అతను మునిగిపోతుండటంతో ఆ తల్లి కేకలు వేసింది. అక్కడే ఉన్న స్థానికులు నదిలోకి దూకి రామ్‌చరణ్‌ను రక్షించే ప్రయత్నం చేశారు. అప్పటికే నదిలో మునిగిన అతను మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏర్గట్ల పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లతో సమావేశం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని కోర్టు అవరణలో బుధవారం ట్రాన్స్‌జెండర్‌లతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి టి.నాగరాణి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రేషన్‌కార్డులు, సొంత ఇళ్లు లేవని వారు న్యాయమూర్తితో పేర్కొన్నారు. అవసరమైన సహాయం అందిస్తానని న్యాయమూర్తి హామీ ఇచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఎన్జీవోస్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ జూనియర్ అసిస్టెంట్ సవిఉల్లా ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మనసెరిగి మసలుకుందాం

- పిల్లలతో రోజూ కాసేపైనా గడుపుదాం
- నిర్లక్ష్యం చేస్తే విపరీత పరిణామాలకు అవకాశం
- నేడు బాలల దినోత్సవం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : స్కూల్లో టీచర్ చెప్పిన పాఠం గురించి కావొచ్చు.. తన దగ్గరి నుంచి ఫ్రెండ్ పెన్సిల్ కొట్టేసిన విషయం కావొచ్చు.. బర్త్‌డే బాయ్ ఇచ్చిన చాక్లెట్ గురించి కావొచ్చు.. ఏదైనా సరే ఆ రోజు స్కూల్లో జరిగిన విషయాలను అమ్మానాన్నలకు చెప్పుకోవాలని పిల్లలు ఆరాటపడుతుంటారు. పొద్దున వెళ్లి సాయంత్రానికి ఇంటికి చేరిన పిల్లలు ఏదో చెప్పబోతుంటే చాలామంది తల్లిదండ్రులు వాళ్లను పట్టించుకోరు. ఒకటికి రెండుసార్లు చెప్పాలని ప్రయత్నించిన తర్వాత అమ్మానాన్నలు తన మాట వినిపించుకోవడం లేదనే భావనకు లోనవుతారు. పిల్లలు ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇవ్వగానే.. మార్కులు ఎందుకు తక్కువ వచ్చాయంటూ గద్దించే తల్లిదండ్రులే ఎక్కువగా ఉంటారు. స్కూల్లో ఆడుతూ పడిపోయినపుడు తగిలిన గాయం గురించి చెబుతుంటే ఎందుకు పరుగు పెట్టావంటూ తిట్టడంతో పసిహృదయం తల్లడిల్లిపోతోంది. వారు చెప్పిన విషయాన్ని వినిపించుకోకుండా నిర్లక్ష్యం చేయడం మూలంగా పసిమనసులు గాయపడుతున్నాయి. ఇది భవిష్యత్‌లో దుష్పరిణామాలకు దారి తీయవచ్చని పేర్కొంటున్నారు మనస్తత్వ నిపుణులు. కనీసం రోజూ ఒక గంటయినా పిల్లలతో ప్రశాంతంగా గడపాలని, వారు చెప్పేది శ్రద్ధగా వినాలని సూచిస్తున్నారు. వీలైనంత వరకు స్మార్ట్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని, దీనికి బదులు ఆడుకునేందుకు అవకాశం కల్పించాలని పేర్కొంటున్నారు. కొన్ని కుటుంబాల్లో అయితే ఇంటికి చేరుకోగానే హోం వర్క్ గురించి తప్ప మరే విషయాన్ని పట్టించుకోరు. సహజంగా పిల్లలకు ఇరుగు పొరుగు పిల్లలతో కలిసి ఆడుకోవాలని, సైకిల్ ఎక్కి తిరగాలని.. ఇలా పలు కోరికలుంటాయి. చదువు ముఖ్యమే కానీ ఆటలు కూడా పిల్లలకు ముఖ్యమనే విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని మానసత్వ శాస్త్ర నిపుణులు సూచిస్తున్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలతో ఎలా మసలుకోవాలన్న విషయమై పలువురు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు..

గౌరవించాలి



పిల్లల మనసులో ఉన్న విషయాలను మనం వినకుండా మనం చెప్పిందే వినాలనే ధోరణి బాగుండదు. వాళ్ల అభిప్రాయం కూడా తీసుకుంటే సంతోషపడతారు. పిల్లల మనసెరిగి మెలిగితే వాళ్లు సక్సెస్ అవుతారు. మా బాబు బాగా చదివి ఇంటర్‌లో టాపర్‌గా నిలిచి ఇంజినీరింగ్‌లో చేరాడు. పాప తొమ్మిదో తరగతి చదువుతోంది. పిల్లల అభిప్రాయాలను తల్లిదండ్రులు గౌరవించాలి.

– ఉప్పల స్రవంతి, గృహిణి, ఎల్లారెడ్డి

అవగాహన అవసరం



పిల్లలకు చదువుతో పాటు ఇతర విషయాలపైనా అవగాహన ఉండాలి. కొందరికి ఆటల మీద, మరికొందరికి కళల మీద ఆసక్తి ఉంటుంది. ఆయా అంశాలలో వారిని ప్రోత్సహించాలి. అలా ప్రోత్సహిస్తే చదువులోనూ రాణిస్తారు. మా స్కూల్ పిల్లలకే కాదు నా ఇద్దరు కూతుళ్లకూ అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తుంటాను. రోజూ ఒక కథ చెబుతాను.

– సురేశ్ డేనియల్, ప్రైవేటు స్కూల్ కరస్పాండెంట్

పిల్లలకు సమయం ఇవ్వాలి



తల్లిదండ్రులు రోజూ కనీసం గంట పాటైనా పిల్లలతో గడిపితే వారు ఎంతో ఆనందంగా ఉంటారు. వాళ్లు చెప్పిన విషయాలను మనం వినాలి. మా స్కూల్ పేరెంట్స్ మీటింగ్‌లో నేను ప్రధానంగా పిల్లలపై శ్రద్ధ చూపాలని చెబుతుంటాను. నా పిల్లల విషయంలోనూ శ్రద్ధ చూపుతాను. రోజూ రాత్రి పడుకునేటపుడు కచ్చితంగా వాళ్లు చెప్పే విషయాలన్నింటినీ వింటాను. కథలు కూడా చెబుతాను. వాళ్లు ఎంతో సంతోషంగా నిద్రపోతారు. పిల్లలకు సమయం ఇవ్వకుంటే వారి ప్రేమను కోల్పోవలసిందే. పిల్లలు సున్నిత మనస్కులు. మమ్మల్ని అమ్మ, నాన్న పట్టించుకోవడం లేదనే భావన రానీయొద్దు.

– జి.శ్రీహరి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

తట్టుకోలేకపోతున్నారు



తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నత స్థితికి ఎదగాలని కోరుకుంటారు. ఈ ప్రక్రియలో మనకు తెలియకుండానే పిల్లలపై ఒత్తిడిని పెంచుతున్నాం. ఈ క్రమంలో వాళ్ల బాల్యాన్ని, సహజంగా నేర్చుకునే ప్రక్రియను, ఓటమిని తట్టుకునే శక్తిని దూరం చేస్తున్నామనిపిస్తుంది. ఎప్పుడూ గెలవాలనే చెబుతున్నాం. ఓడిపోయినా పరవాలేదనే విషయాన్ని చెప్పాల్సిన అవసరం ఉంది. అతి ప్రేమతో వాళ్లకు ఏ చిన్న సమస్య వచ్చినా మనమే పరిష్కరించడం వల్ల వారు సమస్యలను ఎదుర్కొనే శక్తిని పెంచుకోలేకపోతున్నారు. సొంతంగా నేర్చుకునే, సమస్యలను పరిష్కరించుకునే అవకాశం వారికి ఇవ్వాలి.

– పున్న రాజేశ్, ప్రైవేటు స్కూల్ కెరస్పాండెంట్

ప్రోత్సహించాలి



పిల్లలపై చదువు ఒత్తిడి అధికంగా ఉంటోంది. తల్లిదండ్రులు రోజులో కొంత సమయం వారితో గడపాలి. ప్రేమగా మాట్లాడాలి. టీవీ, సెల్‌ఫోన్‌కన్నా పిల్లలు ముఖ్యమని గ్రహించాలి. ఉద్యోగంలో ఒత్తిడిని ఇంట్లో చూపించడం, భార్యాభర్తల మధ్య స్వల్ప తగాదాలూ పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. అలాంటి వాతావరణం ఇంట్లో లేకుండా చూసుకోవాలి. నిత్యం పిల్లల నడవడికను పరిశీలిస్తూ, ఉత్తమ మార్గంలో వెళ్లేలా చూడాలి. అలాగే పిల్లల మాట కూడా వినాలి. మంచి పని చేసినపుడు ప్రోత్సహించాలి. బాధ్యతలు కూడా తెలియజేయాలి. పిల్లల్లో నెగెటివ్ ధోరణి పెరగకుండా చూసుకోవాలి.

– రమణ, మానసిక వైద్య నిపుణులు, కామారెడ్డి

అన్ని విషయాలు చెబుతారు



మా ఇద్దరు పిల్లలు ఇంటికి రాగానే స్కూల్ విషయాలన్నీ చెబుతారు. వాళ్లు చెబుతుంటే నవ్వొస్తుంది. ఫ్రెండ్స్ గురించి, టీచర్ల గురించి అన్నింటినీ తల్లిదండ్రులకు చెప్పడం ద్వారా ఏదో ఒక రకమైన అనుభూతికి లోనవుతుంటారు. ఆ విషయాలను ఓపికతో వినడం వల్ల వారు ఎంతో ఆనందం పొందుతారు. అందుకే వాళ్లు చెప్పే ప్రతీ విషయాన్ని వింటా.

– కళ్యాణి, గృహిణి, కామారెడ్డి

తహసీల్దార్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం



మాచారెడ్డి: పాల్వంచ తహసీల్దార్ జయంత్ రెడ్డిపై కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పాల్వంచ రైతు వేదికలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా పలువురు రైతులు తహసీల్ కార్యాలయంలో పనులు కావడం లేదని ఎమ్మెల్యేతో పేర్కొన్నారు. ఏడాది నుంచి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన ఈ విషయమై తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ''ప్రింటర్ చెడిపోయింది, ఏం చేయమంటారు. ఇలాగే సతాయిస్తే సెలవుపెట్టి వెళ్తా'' అంటూ తహసీల్దార్ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు ప్రజలకు సేవ చేయాలి కానీ ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

'ప్రతి ఇంటిని సర్వే చేయాలి'



తాడ్వాయి: ప్రతి ఇంటిని సర్వే చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం ఆయన ఎర్రాపహాడ్‌లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. సర్వే చేసేటప్పుడు ఏమైనా సందేహాలు వస్తే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు. అనంతరం ఆయన ఎండ్రియాల్ గ్రామంలో పర్యటించి, కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తహసీల్దార్ రహీమొద్దీన్ ఎంపీవో సవితారెడ్డి, ఏవో నర్సింలు, సింగిల్ విండో చైర్మన్ కపిల్‌రెడ్డి తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలి

- సన్న వడ్లు, దొడ్డు వడ్లు కలవకుండా చూడాలి
- గ్రూప్–3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ, అధికారులు

కామారెడ్డి క్రైం: జిల్లా ఉన్నత అధికారులు క్రమంతప్పకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. బుధవారం ఆమె హైదరాబాద్లోని సచివాలయం నుంచి కలెక్టర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ధాన్యం, పత్తి కొనుగోళ్లు, సమగ్ర ఇంటింటి సర్వే, గ్రూప్ –3 పరీక్షలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో సన్న వడ్లు, దొడ్డు వడ్లు కలవకుండా చూడాలని సూచించారు. కలెక్టర్లు పత్తి పంట కొనుగోళ్లపై శ్రద్ధ వహించాలన్నారు. ఈనెల 17, 18 తేదీల్లో గ్రూప్–3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ప్రతి కుటుంబం వివరాలను పక్కాగా సేకరించాలని సూచించారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవసరమైన మేర కంప్యూటర్లను సిద్ధం చేయాలన్నారు. శనివారం నుంచి డాటా ఎంట్రీ ప్రారంభించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

కామారెడ్డి క్రైం: గ్రూప్– 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జిల్లా అధికారులతో మాట్లాడారు. ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేంద్రాలలో శానిటేషన్ చేయించాలని, అన్ని వసతులు కల్పించాలని సూచించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష కేంద్రం లోనికి అనుమతించాలన్నారు. అన్ని స్థాయిలలో అధికారులకు పరీక్ష నిర్వహణపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, ఏఎస్పీ నరసింహారెడ్డి, ఆర్డీవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన ఎల్‌ఆర్‌ఎస్

- ముందుకు సాగని ప్లాట్ల క్రమబద్ధీకరణ
- బల్దియాలలో స్లోగా ప్రక్రియ
- సిబ్బంది కొరతతో ఇబ్బందులు

జిల్లాలో ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నత్తకు నడక నేర్పుతున్నట్లుగా సాగుతోంది. జిల్లాలో 34,138 దరఖాస్తులు రాగా.. ఇప్పటివరకు 7,775 దరఖాస్తులను మాత్రమే పరిశీలించారు. మిగిలినవి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయి.



గోపాల్‌పేటలో క్షేత్రస్థాయిలో వివరాలు పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

నాగిరెడ్డిపేట: లే అవుట్ లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం 2020 లో దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 13,744 దరఖాస్తులు, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల పరిధిలో 20,394 దరఖాస్తులు వచ్చాయి. అప్పట్లో ప్రభుత్వం ఈ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచింది. ఇటీవల దరఖాస్తుల పరిశీలన ప్రారంభమైంది. వీటిని మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ శాఖల అధికారులు పరిశీలిస్తున్నారు.

మున్సిపాలిటీల్లో మరింత మందకొడిగా..

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ గ్రామాల్లో కంటే మున్సిపాలిటీల్లో మరింత నెమ్మదిగా సాగుతోంది. మూడేళ్ల క్రితం ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్ యజమానులు.. ఆ తర్వాత ఆ ప్లాట్‌ను విక్రయించడంతో యాజమాన్యం చేతులు మారింది. కొన్ని ప్లాట్లలో ఇళ్లు కూడా కట్టుకోవడం వల్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం కావడం లేదని తెలుస్తోంది. దీనికితోడు మూడేళ్ల క్రితం సమర్పించిన దరఖాస్తులోని ఫోన్‌నంబర్‌కు అధికారులు ఫోన్ చేస్తే తాను ఎప్పుడో ప్లాటు అమ్ముకున్నానని, తన దరఖాస్తు తొలగించాలని సమాధానం ఇస్తున్నారు. ప్లాటు కొన్న వ్యక్తికి ఫోన్‌చేస్తే తాను నెల్ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోలేదని సమాధానం ఇస్తుండడంతో అధికారులు నివ్వెరపోతున్నారు. మూడు శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేసిన కమిటీలోని ఇరిగేషన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ల పనితో పోలిస్తే ఎంపీడీవో పరిధిలో పరిశీలన ప్రక్రియకు సంబంధించి ఎక్కువ పనిభారం ఉండడం వల్ల దరఖాస్తుల పరిశీలన వేగంగా సాగడం లేదని తెలుస్తోంది. దీంతోపాటు మున్సిపాలిటీల్లో దరఖాస్తులు అధిక సంఖ్యలో రావడం కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 13,744 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు 6,630 దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యింది. మరో 7,114 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 20,394 దరఖాస్తులు రాగా 1,145 దరఖాస్తులను మాత్రమే పరిశీలించారు. ఇంకా 19,249 దరఖాస్తులు వివిధ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్నాయి.

సర్వేయర్లు లేక..

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు ఎంపీడీవో, ఆర్ఐ, ఇరిగేషన్ ఏఈలతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు సంబంధించిన స్థలం చెరువు శిఖంలో ఉందా, లేదా అని ఇరిగేషన్ ఏఈ నిర్ధారణ చేయాల్సి ఉంటుంది. అదే దరఖాస్తుకు సంబంధించిన స్థలం ప్రొహిబిటెడ్ ల్యాండ్ కిందకు వస్తుందా, లేదా అని ఆర్ఐ నిర్ధారించాల్సి ఉంటుంది. దీంతోపాటు అదే దరఖాస్తుకు సంబంధించిన స్థలం కొలతలు తీయడం, డాక్యుమెంట్‌ను పరిశీలించడం తోపాటు మ్యాన్యువల్‌గా వెరిఫికేషన్ చేయాల్సిన బాధ్యత ఎంపీడీవోది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు ఏర్పాటు చేసిన కమిటీలో సర్వేయర్ లేకపోవడం వల్ల పరిశీలన ప్రక్రియలో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నట్లు కమిటీలోని అధికారులు పేర్కొంటున్నారు. దీనికితోడు ఇటీవల ప్రారంభమైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మరింత మందగించింది.

బాలలను వేధిస్తే కఠిన చర్యలు

- జిల్లా న్యాయమూర్తి వరప్రసాద్



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు వరప్రసాద్, నాగరాణి

కామారెడ్డి టౌన్: బాలలను హింసించినా, లైంగికంగా వేధించినా చట్టపరంగా కఠినమైన చర్యలుంటాయని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, జిల్లా కోర్టు న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, మహిళాశిశు సంక్షేమ శాఖ, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. బాల కార్మికులు లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. లైంగిక వేధింపులపై న్యాయపరమైన సలహాలు, సూచనల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 15100 ను సంప్రదించాలని సూచించారు. జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.నాగరాణి మాట్లాడుతూ బాలల హక్కులు అందరికీ సమానమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం బాలలు, మహిళల చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.స్రవంతి, సభ్యురాలు స్వర్ణలత, బార్ అసోసియేషన్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ప్రతినిధులు శ్యాంసుందర్‌రావు, నల్ల నాగభూషణం, నాగేశ్, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కామారెడ్డి అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. గురువారంనుంచి ఈనెల 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, కార్యదర్శి వంశీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 14న ఉత్సవాలను ప్రారంభమవుతాయని, 15న పుస్తక ప్రదర్శన, 16, 17 తేదీలలో వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు, 18న చిత్రలేఖనం పోటీలు, 19న రంగోలి, మెహిందీ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

యువత బీజేపీ సభ్యత్వం తీసుకోవాలి

● బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేష్



కామారెడ్డి టౌన్: యువత బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేష్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన బీజేవైఎం జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదులో బీజేవైఎం కీల పాత్ర పోషించాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి సభ్యత్వం నమోదు చేయించాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి అరవింద్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, నాయకులు రాజేష్, భరత్, రాజగోపాల్, నవీన్ తదితరులున్నారు.

నేడు వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కామారెడ్డి అర్బన్: విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ హుతాత్మ దివస్ సందర్భంగా నేడు(గురువారం) మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక నిజాంసాగర్ చౌరస్తా సమీపంలోని కావేరి హోటల్‌పైన ఉన్న కేబీఎస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం తెలిపారు. నా దేశం-నా ధర్మం-నా రక్తం నినాదంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామారెడ్డి: మండలంలోని చిన్నమల్లారెడ్డి సబ్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణంలోని కాకతీయనగర్, హౌసింగ్‌బోర్డు, చిన్నమల్లారెడ్డి, నర్సన్నపల్లి, రాజంపేట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పట్టణ ఏడీఈ కిరణ్ చైతన్య బుధవారం తెలిపారు. స్థానిక వినియోగదారులు సహకరించాలన్నారు.

సమగ్ర సర్వే పరిశీలన

రాజంపేట: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని స్థానిక తహసీల్దార్ అనిల్ కుమార్ సూచించారు. బుధవారం బస్వన్నపల్లిలో చేపడుతున్న సమగ్ర సర్వేను పరిశీలించారు. ప్రతి రోజు 20 కుటుంబాల వరకు సర్వే నిర్వహించాలని ఎన్యుమరేటర్లను సూచించారు.

గోదావరి తీరం.. ఆధ్యాత్మిక హారం

- కార్తీక మాసంలో పుణ్యస్నానాలు
- నదులకు తరలివెలుతున్న భక్తులు



కందకుర్తి త్రివేణి సంగమంలో స్నానాలు చేస్తున్న భక్తులు (ఫైల్)

నిజామాబాద్ రూరల్: కార్తీక మాసం వచ్చిందంటే శివ నామస్మరణతో మారు మోగుతుంది. శైవ క్షేత్రాలు దేదీప్యమానంగా వెలుగొందుతుంటాయి. ఉపవాస దీక్షలతో పరమశివుని ఆరాధిస్తారు. ఉదయం, సాయంత్రం దీపాలను భక్తిశ్రద్ధలతో వెలిగిస్తారు. గోదావరి నదిలో పుణ్య స్నానం ఆచరించడానికి ఆసక్తి చూపిస్తారు. గంగమ్మకు పూజలు చేస్తూ హారతులు ఇస్తారు. కార్తీక మాసంలో నది స్నానం చేస్తే ఎంతో పుణ్యమని పండితులు పేర్కొంటున్నారు. భారతదేశంలో నైరుతి రుతుపవనాల వల్ల భారీ వర్షాలు కురుస్తాయి. అంటే ఆశ్వయుజమాసం వరకు రుతుపవనాల వల్ల వర్షాలు కురుస్తాయి. దీంతో అప్పటి వరకు వరదతో పోటెత్తిన నదులన్నీ.. కార్తీక మాసం వచ్చే సరికి తమ ఉధృతిని తగ్గించుకుంటాయి. కార్తీక మాసం ఆధ్యాత్మిక మాసం. ఈ నెలలో చేసే నది స్నానానికి, దీప దానానికి, శివ కేశవుల పూజకు అత్యంత విశిష్ట స్థానం ఉంది. కార్తీక మాసంలో నెల రోజుల పాటు సూర్యోదయాని కంటే ముందే అంటే ఆకాశంలో నక్షత్రాలు ఉండగానే ప్రవహించే నీటిలో స్నానం చేస్తారు.

నది స్నానం ఔషధ గుణాలు

కార్తీక మాసంలో వరద తేటగా మారుతుంది. రాళ్లని, వృక్షాలను రాసుకుంటూ సాగే నదులు. ఆయా ఖనిజాలను, మూలికలను తమలో కలుపుకొని ప్రవహిస్తూ సాగిపోతూ ఉంటాయి. దీంతో నదీజలాలలో ఔషదీగుణాలు కూడా ఈ సమయంలో అధికంగా ఉంటాయి. కనుక ఈ నెలలో నదీ స్నానం ఆరోగ్యపరంగా మంచిదని పెద్దలు పేర్కొంటున్నారు.

జ్యోతిష్యశాస్త్ర ప్రకారం నీటి, మానవుల మనసుపై చంద్రుని ప్రభావం అధికంగా ఉంటుంది. ఈ మాసంలో చంద్రుడు చాలా శక్తిమంతంగా ఉంటాడు. అందుకే ఈ కార్తీక మాసాన్ని 'కౌముది మాసం అని కూడా అంటారు. చంద్ర కిరణాలతో ఔషధులతో తడిచిన నదుల్లో ఉదయాన్నే స్నానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని ఓ నమ్మకం. నదులను దైవంగా భావించి పూజిస్తారు. దీపాలు నీటిలో విడిచి పెట్టి భక్తిశ్రద్ధలతో పూజిస్తారు.



కందకుర్తిలోని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఆలయాల్లో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

18,19న వినియోగదారుల జాతీయ సమావేశాలు



మాట్లాడుతున్న చక్రపాణి, సుదర్శన్

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలో వినియోగదారుల జాతీయ సమావేశాలను ఈ నెల 18, 19న నిర్వహించనున్నట్లు సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి చర్ల సుదర్శన్ పేర్కొన్నారు. ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నగరంలోని మహేశ్వరిభవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 18న జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం, 19న 'వినియోగదారుల రక్షణ చట్టం 2019 అమలులో వివిధ ప్రభుత్వ శాఖల ప్రాధాన్యత' అంశంపై జాతీయ సెమినార్ ఉంటుందన్నారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల అధికారులచే బంగారు ఆభరణాలపై హాల్ మార్కింగ్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్, సరైన ఆహారం పొందే హక్కు, వంటనూనెలు, పాలపొడిలపై శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పెందోట అనిల్ కుమార్, వీఎస్ వర్మ, సందు ప్రవీణ్, మహదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, లక్ష్మి, ప్రవళిక, బి హరిప్రియ, రాజుల రామనాథం, యాటకర్ల దినేశ్, మల్లెల సునీత, ఎస్ రమ్య ఉన్నారు.

సాయికుమార్‌కు ఎంపీ పరామర్శ



నిజామాబాద్‌నాగారం: బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని మృతి చెందడంతో నిరసన తెలిపి పోలీసులు లాఠీ చార్జీలో దెబ్బలు తిని జీజీహెచ్‌లో చికిత్స పొందుతు న్న ఏబీవీపీ కార్యకర్త సాయికుమార్‌ను ఎంపీ అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం పరామర్శించారు. సాయి ఆరో గ్య పరిస్థితిపై వైద్యుడు డాక్టర్ వెంకట రమణారెడ్డితో మాట్లాడి తెలుసుకున్నారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులచారి, రాష్ట్ర కార్యదర్శి పల్లెగం గారెడ్డి, ఏబీవీపీ రాష్ట్ర పూర్వఅధ్యక్షుడు రెంజర్ల నరేశ్, నాయకులు పిల్లి శ్రీకాంత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కల్లు సీసాలో బల్లి.. ఒకరికి అస్వస్థత



కల్లు సీసాలో వచ్చిన బల్లి

రెంజల్: కల్లు సీసాలో బల్లి రావడంతో దాన్ని సేవించిన ఒకరు అస్వస్థతకు గురైన ఘటన రెంజల్ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని కల్లుబట్టీలో స్థానికుడు ఒకరు కల్లు సీసా తీసుకుని అక్కడే సేవించాడు. అందులోని అడుగు భాగంలో బల్లి ఉన్నట్లు గుర్తించిన వెంటనే వాంతులు చేసుకున్నాడు. స్థానికులు కల్లు బట్టీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసి కల్లు బట్టీని మూసే వరకు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనను విరమింపజేశారు. కల్లు తాగి అస్వస్థతకు గురైన వ్యక్తిని నిర్వాహకులు ఆస్పత్రిలో చికిత్సలు అందించారు. మండలంలో కల్తీ కల్లు ఏరులై పారుతున్నా ఎక్సైజ్ పోలీసులు కన్నెత్తి చూడటంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సర్వేను సమగ్రంగా చేపట్టాలి



సోమేశ్వర్‌లో సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి, తహసీల్దార్ వరప్రసాద్

బాన్సువాడ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, కులగణన సర్వేను ఎన్యుమరేటర్లు నిర్ణీత గడువులోపు చేపట్టాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. సోమేశ్వర్‌లో కొనసాగుతున్న సర్వేను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి సర్వే ప్రారంభించాలని, రోజు కనీసం 20 కుటుంబాలను సర్వే చేయాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారి 765–డి విస్తరణ పనులు పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ వరప్రసాద్ ఉన్నారు.

జిల్లాలో 423 ధాన్యం కొనుగోలు కేంద్రాలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

ఎల్లారెడ్డి: జిల్లాలో 423 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. బుధవారం ఆజామాబాద్‌లో సన్నరకం ధాన్యం కొనుగోలును ఆయన ప్రారంభించి మాట్లాడారు. సన్నరకం ధాన్యంలో తేమ శాతం రాకపోవడంతో కొనుగోలులో జాప్యం జరిగిందన్నారు. సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జిల్లాలో 396 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సొసైటీల ఆధ్వర్యంలో నడుస్తుండగా, 27 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్నాయన్నారు. వెల్లుట్ల సొసైటీలో పని చేస్తున్న కార్యదర్శితో పాటు సిబ్బందిని బదిలీ చేయాలని కోరుతూ రైతులు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. డీఎం రాజేందర్, డీసీవో, తహసీల్దార్ మహేందర్ కుమార్, రైతులు తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ విజేత జిల్లా బాలికల జట్టు



బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి బాలికల హాకీ టోర్నీ విజేతగా నిజామాబాద్ జట్టు నిలిచింది. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న బాలికల హాకీ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో 2–0 తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై జిల్లా జట్టు విజయం సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. బుధవారం ముగింపు కార్యక్రమానికి ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్ హాజరై మాట్లాడారు. క్రీడలు నిజామాబాద్ జిల్లాకు పుట్టినిల్లు అని, త్వరలోనే ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు జిల్లాకు స్టేడియాన్ని అన్ని హంగులతో నిర్మించబోతున్నామని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన గడుగు గంగాధర్ మాట్లాడుతూ.. క్రీడలతో శారీరిక దృఢత్వంతో పాటు మానసి క ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో క్రీ డల కార్యదర్శి నాగమణి, గ్లోబల్ పాఠశాల చైర్మన్ సంతోష్ కుమార్, పీడీలు రవికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి గోపిరెడ్డి, పేట సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి, శీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడాపోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మోపాల్: మండలంలోని కంజర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో 10వ జోనల్ స్థాయి క్రీడాపోటీలు మూడోరోజు పోటాపోటీగా కొనసాగాయి. అండర్–14, 17, 19లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పరుగు పందెం, చెస్, క్యారం, ఇతర 11 రకాల క్రీడా పోటీలు ఉల్లాసంగా, ఆసక్తిగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కంజర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ విజయలలిత మాట్లాడుతూ.. గురువారం జోనల్ స్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థినులు ఎంతో ఉల్లాసంగా క్రీడల్లో పాల్గొంటున్నారని, అందరి సహకారంతో పోటీలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. పీడీ ఉదయశీల, పీఈటీ లత, ఎస్‌వీపీ వినోద, జేవీపీ సునీత, పీఈడీలు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు భద్రత కల్పించండి



సీఎస్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నిజామాబాద్‌అర్బన్: వికారాబాద్ దాడి ఘటనకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగ జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని కలిసిన జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లకచర్ల గ్రామంలో కలెక్టర్‌తో సహా వివిధ కేడర్ల రెవెన్యూ అధికారులపై జరిగిన దాడిపై రెవెన్యూ ఉద్యోగులతో పాటు యావత్ ఉద్యోగవర్గం అంతా భయాందోళనకు గురవుతున్నారని అన్నారు. విధినిర్వహణలో ఉద్యోగులపై ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలను అమలు చేయాలన్నారు. బాధ్యులైన వ్యక్తులను చట్టపరంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏలూరి శ్రీనివాస్‌రావు, వంగ రవీందర్ రెడ్డి, కె చంద్ర మోహన్, కె గౌతమ్ కుమార్, సత్యనారాయణ, భవాని శంకర్, కె నిరంజన్, రమన్ రెడ్డి, పి సుధాకర్, రామకృష్ణారెడ్డి, భార్గవ్ పాల్గొన్నారు.

26 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఎం అరుణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. డిగ్రీ సీబీసీఎస్ బీఏ/ బీకాం/ బీఎస్సీ/ బీ బీఏ/ బీసీఏ–1, 3, 5 వ సెమిస్టర్ రెగ్యులర్, 2, 4, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్(2020 నుంచి 202 3) బ్యాచ్ విద్యార్థులకు మాత్రమే ఈ షె డ్యూ ల్ వర్తిస్తుందన్నారు. ఈనెల 20 నుంచి ని ర్వహించాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను విద్యార్థు ల కోరిక మేరకు 26 నుంచి నిర్వహించనున్న ట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

డిగ్రీ రీవాల్యుయేషన్ నోటిఫికేషన్ విడుదల

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ రీవాల్యుయేషన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. డిగ్రీ సీబీసీఎస్ 1, 2, 3, 4, 5, 6వ సెమిస్టర్(బ్యాక్ లాగ్), 1, 2, 3వ(ఓన్లీ బ్యాక్ లాగ్) జూలై, ఆగస్టు–2024 పరీక్షకు హాజరైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని కంట్రోలర్ ఎం అరుణ బుధవారం పేర్కొన్నారు. ఒక్కో పేపర్‌కు రూ.500 రీవాల్యుయేషన్ ఫామ్‌కు రూ. 25 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 23 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

జిల్లాకు విచ్చేసిన భూగర్భ గనులశాఖ సెక్రెటరీ



సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వ భూగర్భ గనుల శాఖ సెక్రెటరీ కె సురేంద్ర మోహన్ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా మైన్స్‌శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఏడీ విజయ్‌కుమార్ రాథోడ్ బుధవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. వారి వెంట భూగర్భగనుల శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

దుబాయిలో అమ్దాపూర్ వాసి మృతి



హరికృష్ణ (ఫైల్)

బోధన్‌రూరల్: దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట హరికృష్ణ(38) మృతి చెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన హరికృష్ణ బతుకు దెరువు నిమిత్తం గత నెల 24న దుబాయికి వెళ్లాడు. అక్కడ పనిచేస్తున్న ప్రాంతంలో గత నెల 31న రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని కంపెనీ ప్రతినిధులు ఈ నెల 7న కుటుంబీకులకు సమాచారం అందించారు. దుబాయి నుంచి హరికృష్ణ మృతదేహం గురువారం స్వగ్రామానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. కుటుం పెద్ద దిక్కు కోల్పోడంతో కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఆర్మూర్‌టౌన్: పెర్కిట్‌లోని సంతోష్ ఫ్యామిలీ దాబా హోటల్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 40 ఏళ్ల వరకు ఉంటుందని, అతని ఒంటిపై నలుపు రంగు షర్ట్, బ్లూ కలర్ జీన్ ప్యాంట్ ఉందన్నారు. మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712659858 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

పిట్లం: మద్యానికి బానిసైన ఒకరు జీవితంపై విరక్తితో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన పిట్లం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పత్తి కాంతయ్య(59)ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరచూ ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డబ్బుల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బాల్కొండ: మెండోరా మండలం కొడిచర్లలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై నారాయణ బుధవారం తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో 3క్వింటాళ్ల10 కిలోల బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్‌కు సమచారం అందించడంతో ఆయన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్లు..

రెంజల్/ రుద్రూర్: బోధన్ మండలం పెగడాపల్లి నుంచి మండలంలోని సాటాపూర్‌కు అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బుధవారం తెల్లవారుజామున ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి పట్టుకొని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక, మొరంను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. పోతంగల్ మండలం కల్లూర్ శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య బుధవారం పేర్కొన్నారు. కొడిచర్ల నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకుని కోటగిరి పీఎస్‌కు తరలించినట్లు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు శిక్షను మెజిస్ట్రేట్ అహ్మద్ మొహినొద్దీన్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ వీరయ్య బుధవారం పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడిపిన నలుగురికి కౌన్సిలింగ్ నిర్వహించి వారిని కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ ముగ్గురికి రూ. 8 వేలు జరిమానా విధించగా ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

కేసు నమోదు

సిరికొండ: మండలంలోని చీమనుపల్లి జీపీ పరిధిలోని చేనియా నాయక్ తండాలో భూమి విషయంలో ఘర్షణ పడిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్‌రామ్ బుధవారం తెలిపారు. తండాకు చెందిన అజ్మీర జీవన్, అజ్మీర బాలు భూమి విషయంలో గొడవపడి పరస్పరం దాడి చేసుకున్నారని తెలిపారు. ఇరువురి ఫిర్యాదు మేరకు అజ్మీర జీవన్, అజ్మీర వినోద్, అజ్మీరా బాలు, దప్పు రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని గొర్రెలు మృతి

బోధన్ రూరల్: మండలంలోని బండార్‌పల్లి గ్రామ సమీపంలో ఉన్న రాజన్న చౌరస్తా వద్ద బుధవారం ఇసుక టిప్పర్ ఢీకొని మూడు గొర్రెలు మృతి చెందాయి. మంజీర నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వడంతో ఆ మార్గం ఇసుక టిప్పర్లు నడుస్తున్నాయి. టిప్పర్లు అతివేగంగా వెళ్తూ గొర్రెలను ఢీకొనడంతో గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని ఘటన స్థలాన్ని పరిశీలించారు.

పేకాట స్థావరంపై దాడి

రామారెడ్డి: మండల కేంద్రంలో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై నరేశ్ బుధవారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ 2690 నగదు, 7 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా పేకాట ఆడితే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

సమన్వయంతో మెరుగైన న్యాయసేవలు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: బార్ అండ్ బెంచ్ సమన్వయంతో కక్షిదారులకు మెరుగైన న్యాయసేవలు అందిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా జడ్జి బుధవారం నిర్వహించిన న్యాయవాదుల సమావేశంలో మాట్లాడారు. కోర్టుల ద్వారా సత్వర న్యాయాన్ని ఆశిస్తున్న న్యాయార్థుల ఆశలకు అనుగుణంగా కృషి చేద్దామని అన్నారు. న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత ఎంతో ఉందని, దానిని కాలానికి, సమయానికి అనుగుణంగా మార్చుకుని సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు మరింత ఎక్కువగా కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేస్తే కోర్టుల్లో విచారణ దశలో ఉన్న కేసులను పరిష్కరించే వెలుసుబాటు లభిస్తుందని జిల్లా జడ్జి పేర్కొన్నారు. బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. న్యాయవాద సమాజం ఎల్లప్పుడు ప్రజలకు మెరుగైన, త్వరితగతిన న్యాయసేవలు అందించడానికి కృషి చేస్తుందని అన్నారు.

జిల్లా ప్రజలకు జిల్లా న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని నిలబెడతామని, కోర్టుల్లో న్యాయమూర్తుల, సిబ్బంది కొరత ఉ న్నా చాలా కోర్టు కేసులు అనుకున్న దానికంటే ఎక్కువగానే పరిష్కారమవుతున్నాయని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి తెలిపా రు. సమావేశంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు ఖుష్బూ ఉపాధ్యాయ్, హరికృష్ణ, హరి కుమార్, చైతన్య, బార్ ఉపాధ్యక్షుడు పెందెమ్ రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కార్యదర్శి సురేశ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

లంచం తీసుకున్న ఏఈకి రెండేళ్ల జైలు

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): లంచం తీసుకున్న ఓ ఏఈకి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ నాంపల్లి ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోజ్ అక్తర్ బుధవారం తీర్పు ఇచ్చారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని బొబ్బిలివీధికి చెందిన కాంట్రాక్టర్ బండారి అరవింద్.. పుష్కర కాలం క్రితం నగరంలోని సంజయ్ పార్క్ నుంచి విజ్ఞాన్ పాఠశాల వరకు రోడ్డు పనులు చేశారు. కొలతలను నమోదు చేయడానికి ఏఈ పోరెడ్డి అశోక్ రూ. 40 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు వలపన్ని 2012 మే 29న రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా ఏఈని పట్టుకున్నారు. ఈ కేసులో ఏసీబీ తరఫున నాంపల్లి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏఎల్ మనోజ్ఞ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న నాంపల్లి ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోజ్ అక్తర్ బుధవారం తీర్పు ఇచ్చారు. లంచం తీసుకున్న ఏఈ పోరెడ్డి అశోక్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 40 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేని పక్షంలో మరో నెల రోజులు అదనపు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.